సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 25 । మే । 2023



దివ్యాంగులకు అండగా..
దివ్యాంగులకు అండగా నిలవాలనే లక్ష్యంతో గొలగమూడిలో దివ్యాంగుల కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.
8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,560
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,618
3 శాతం జీఎస్టీతో	రూ.5,786
నవర (8 గ్రా)	రూ.46,288

గరిష్ఠం/కనిష్ఠం
40.9 /29.0

వాతావరణం
జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 58 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

సోమశిలలో 43.740 టీఎంసీలు



సోమశిల జలాశయం (ఫైల్)

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 43.740 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 183 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 95.014 మీటర్లు ఉంది.

హజ్ యాత్రికుల వివరాలివ్వాలి

నెల్లూరు(బారకాసు): ట్రావెల్స్ ఏజెన్సీలు తాము హజ్ యాత్రకు తీసుకెళ్లే వారి వివరాలను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఇవ్వాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యాత్రికులకు సంబంధించి వ్యాక్సినేషన్ ధ్రువీకరణపత్రాన్ని తీసుకోవాలని తెలియజేశారు.

తహసీల్దార్ల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేసినట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. టి.వెంకటసునీల్ నుడా వీసీ ప్రత్యేక తహసీల్దార్‌గా నియమితులయ్యారు. దగదర్తి డీటీ ఎస్.చెంచయ్య అదే మండల తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా, దగదర్తి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు సైదాపురానికి, అక్కడ తహసీల్దార్ (అడహక్)గా పనిచేస్తున్న వి.విజయలక్ష్మి కలువాయికి (అడహక్), అనంతసాగరం డీటీ ప్రదీప్ అదే మండలానికి తహసీల్దార్ (అడహక్)గా బదిలీ అయ్యారు. అనంతసాగరం తహసీల్దార్ (అడహక్)గా విధులు నిర్వహిస్తున్న అన్నదాత వెంకటరమణరావు ఏఎస్‌పేటకు (అడహక్), ఏఎస్‌పేట తహసీల్దార్ (అడహక్) ఎం.సుభద్ర ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ (అడహక్)గా, అక్కడి డీఏఓ డీవీ మధుసూదన్ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ డీపీఓ, ఇక్కడి డీఏఓ పి.శ్యామలమ్మ కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

ఆయిల్‌పామ్ వైపు.. రైతుల చూపు

వరి, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులకు లాభాలు తెచ్చిపెట్టే పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటి. జిల్లాలో దీనిని సాగు చేసేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు సాగును ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో ప్రోత్సహించలేదు. దీంతో రైతులు వేరే పంటల వైపు మళ్లారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది.

- తోటల సాగుపై పెరుగుతున్న ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- అంతర పంటలతోనూ ఆదాయం
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 11 మండలాల్లో సాగు



బండారుపల్లిలో ఆయిల్‌పామ్ తోట

ఆత్మకూరు: ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధంతో ఏడాది కాలంగా వంట నూనెల ధరలు పెరిగాయి. దిగుమతులు కూడా తగ్గిపోయాయి. అయితే రాష్ట్రంలో పామాయిల్ ఉత్పత్తి మెరుగ్గా ఉండడంతో ధరాఘాతం ప్రజలకు పెద్దగా తగల్లేదని చెప్పొచ్చు. గతంలో ఆయిల్‌పామ్ పంట ఉత్పత్తులు బాగున్నా కొనుగోలు ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు నిరాశ చెందారు. అనంతరం ధరలు పెరగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకంగా నగదు అందిస్తుండడంతో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. ఒకప్పుడు కేవలం సంప్రదాయక వేరుశనగ, నువ్వులు, కుసుమ నూనెలు మాత్రమే వాడకంలో ఉండేవి. కాలక్రమేణా అనేక మార్పులు వచ్చాయి. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చింది. అప్పట్లోనే నెల్లూరు జిల్లా రైతులు దీని సాగుకు మొగ్గు చూపి కొత్తదనాన్ని ఆహ్వానించారు.

20 ఏళ్లుగా సాగు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు 20 సంవత్సరాలుగా జరుగుతోంది. అయితే మధ్యలో కొంతకాలం ఆశించిన స్థాయిలో ధరలు రాకపోవడంతో కొందరు రైతులు సాగును విరమించుకున్నారు. తోటలను సైతం తొలగించి రొయ్యల గుంటలుగా మార్చిన సందర్భాలున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రోత్సాహం, గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 11 మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని గణాంకాల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వ సబ్సిడీ ఇలా..

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మొక్కలు, వ్యవసాయ ఖర్చుల నిమిత్తం హెక్టార్‌కు (రెండున్నర ఎకరాలకు) మొదటి సంవత్సరం రూ.27,599, రెండో సంవత్సరం రూ.1,401లను ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తోంది. ఎరువుల కోసం మొదటి ఏడాది రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు కలిపి మొత్తం రూ.21 వేలు సబ్సిడీ ఇస్తోంది. అంతర పంటల కోసం నాలుగేళ్లపాటు రూ.21 వేలు అందజేస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతంగా ఉంది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..

సాగులో ఎన్ని ఎకరాలంటే.. : మూడు వేలు

మండలాలు :
ఆత్మకూరు, ఏఎస్‌పేట, వెంకటాచలం, పొదలకూరు, చేజర్ల, కలువాయి, దగదర్తి, బుచ్చి, బాలాయపల్లి, వెంకటగిరి, దొరవారిసత్రం

టన్ను ధర రూ.13,869

నాలుగేళ్లుగా గిట్టుబాటు ధరలు లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం టన్నుకు రూ.13,869 ధర చెల్లిస్తున్నారు. గతేడాది ఆత్మకూరు మండలం బండారుపల్లికి చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డికి అత్యధికంగా టన్నుకు రూ.22,770 చెల్లించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సంబంధిత బోర్డు ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తుందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ధరలు బాగున్నాయని, పంట ఉత్పత్తులు తీసుకున్న వారంరోజులకే బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతోందని రైతులు పేర్కొంటున్నారు.

మొక్కలు సరఫరా చేస్తున్న కంపెనీలు

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు కలెక్షన్ పాయింట్లను సంప్రదిస్తే కంపెనీల వారు రైతులకు మొక్కలు సరఫరా చేస్తారు. ఒక్కో మొక్క రూ.193.. రవాణా చార్జి రూ.50 చొప్పున తీసుకుని రైతులకు నేరుగా అందజేస్తారు. చాలావరకు రైతులు తమ దిగుబడులను కలెక్షన్ పాయింట్లకే చేరుస్తారు.

నాలుగేళ్లకే కాపు

ఆయిల్‌పామ్ మొక్కలు ఎకరాకు 57 చొప్పున ట్రయాంగిల్ పద్ధతిలో నాటుతారు. నాలుగేళ్లకే పెరిగి గెలలు వేసి కాపుకొస్తాయి. కొన్ని తోటల్లో భూసారం బట్టి, చెట్ల ఎదుగుదలను బట్టి మూడేళ్లకే కాపుకొస్తాయి. తొలి ఏడాది 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రతి ఏడాది దిగుబడి పెరుగుతూ ఉంటుంది. 8 సంవత్సరాల వయసు గల తోటలో ఎకరాకు 10 నుంచి 14 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ప్రతి 15 రోజులకు ఒకసారి గెలలు కోసి కలెక్షన్ పాయింట్లకు తరలిస్తుంటారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వింజమూరు, గూడూరు, పొదలకూరు ప్రాంతాల్లో పామాయిల్ పంట గెలల సేకరణ పాయింట్లు ఉన్నాయి. సేకరించిన పంటను ఏలూరు సమీపంలోని పెదవేగి, కాకినాడ ఫ్యాక్టరీలకు తరలిస్తారు.

ధర బాగుంది



17 ఏళ్లుగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాం. తొలినాళ్లలో ఇబ్బందులు పడ్డాం. ధర లేకపోవడంతో చెట్లు తొలగించాలనుకున్నాం. ఏలూరు, కాకినాడ నుంచి కంపెనీ వాళ్లు వచ్చి మంచి ధర చెల్లిస్తామని చెప్పారు. అదే ప్రకారం ప్రస్తుతం గిట్టుబాటు ధర లభిస్తోంది. ముదురుతోట ఎనిమిది ఎకరాల్లో సాగవుతోంది. తోట (ఏడాది) మరో 8 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. అంతర పంటగా పత్తి పంట వేశాం. దాని ధర కూడా బాగుంది.

– బొమ్మిరెడ్డి పాపులమ్మ, ఆయిల్‌పామ్ రైతు, బండారుపల్లి, ఆత్మకూరు మండలం

విస్తీర్ణం పెరుగుతోంది



ఆయిల్‌పామ్ విస్తీర్ణం మూడేళ్లుగా పెరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం ఓ వైపు, ఫ్యాక్టరీ వారు రైతులతో మమేకమై కొనుగోలు చేసేందుకు కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో విస్తీర్ణం పెరుగుతోంది. రైతులకు కావాల్సిన సలహాలు చెబుతూ వారి తోటలను స్వయంగా పర్యవేక్షిస్తున్నాం.

– రాజశేఖర్, ఉద్యాన శాఖ ఏడీ, ఆత్మకూరు

అదనపు ఆదాయం



ఆయిల్‌పామ్ చెట్టుకు గెలలు

నాలుగేళ్లకు కాపుకొచ్చే ఆయిల్‌పామ్ తోటల్లో మూడేళ్లపాటు అంతర పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంది. పత్తి, వేరుశనగ, జామ, కోకో లాంటి మెట్ట పైర్లు సాగు చేస్తూ రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. అంతర పంటలకు సంబంధించి ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం అన్నదాతలకు వరం. ఆత్మకూరు మండలంలోని బండారుపల్లి, కొట్టాలు, అప్పారావుపాళెం గ్రామాల్లో ఇటీవల ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇప్పటికే 120 ఎకరాల్లో సాగు ఉండగా, ప్రస్తుతం మరో 40 ఎకరాల్లో సాగుకు సిద్ధమవుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ఉదయం ఫస్టియర్ పరీక్షకు 6,835 మందికి గానూ 6,358 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 1,475 మందికి గానూ 1,325 మంది హాజరయ్యారు. ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్ అధికారులు 55 కేంద్రాలను తనిఖీ చేశారు.

లంచం డిమాండ్ చేసి.. ఏసీబీకి చిక్కి..

- మ్యుటేషన్‌కు రూ.10 వేలు డిమాండ్ చేసిన వీఆర్వో
- అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ



వీఆర్వో హజరత్ మస్తాన్ (వృత్తంలో ఉన్న వ్యక్తి). చిత్రంలో ఏసీబీ అధికారులు

దుత్తలూరు: మ్యుటేషన్ చేసేందుకు ఓ వ్యక్తిని వీఆర్వో రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు వీఆర్వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన బుధవారం దుత్తలూరు మండలంలో జరిగింది. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. సోమలరేగడ గ్రామానికి చెందిన వంగూరు రాధాకృష్ణారెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. 2022 సంవత్సరం నవంబర్‌లో అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 141–1లో 1.38 ఎకరాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించాడు. సదరు పొలానికి సంబంధించి మ్యుటేషన్ కోసం మార్చి, ఏప్రిల్‌లో రెండుసార్లు దరఖాస్తు చేశాడు. పలుమార్లు తిరిగినా అధికారులు స్పందించలేదు. ఈనెల 17న మళ్లీ దరఖాస్తు చేశాడు. ఈ విషయమై ఇన్‌చార్జి వీఆర్వో హజరత్ మస్తాన్‌ను అడగ్గా రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో రాధాకృష్ణారెడ్డి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచనల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోకు రూ.10 వేలు లంచం ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ డీఆర్‌ఆర్ మోహన్, సీఐలు జీఎల్ శ్రీనివాసరావు, డి.రమేష్‌బాబు, జి.వేణు, టి.కిరణ్, ఏఎస్సై సురేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వడం ఇష్టం లేకే..



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తాను. మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసి పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగాను. వారి నుంచి సరైన సమాధానం లేదు. చివరిగా వీఆర్వోను అడగ్గా లంచం డిమాండ్ చేశాడు. డబ్బు ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాను.

– రాధాకృష్ణారెడ్డి

ఉన్నత చదువులకు భరోసా

జగనన్న విద్యా దీవెన.. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకం. గతంలో పిల్లల్ని చదివించేందుకు తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదు. క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజును ఆ త్రైమాసికం అయిన వెంటనే ప్రభుత్వం ఇస్తోంది. దీంతో విద్యార్థులు ఏ చింత లేకుండా హాయిగా చదువుకుంటున్నారు.



విద్యార్థినులకు మెగా నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్

- పేద విద్యార్థులకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- నెల్లూరులో మెగా నమూనా చెక్కు అందజేసిన మంత్రి కాకాణి
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : మంత్రి

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి జనవరి – ఫిబ్రవరి – మార్చి – 2023 త్రైమాసికం నిధులు విడుదలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తదితరులు సీఎం సభను వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ఎంతోమంది విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. తండ్రి స్ఫూర్తితో సీఎం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 37,485 మంది విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.34,36,07,420 నిధులిచ్చారన్నారు. నాడు – నేడు, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి, విదేశీ విద్య వంటి తదితర పథకాలతో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. పేదల కుటుంబాల్లోని విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు క్రమం తప్పకుండా ఆర్థిక సాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తల్లిదండ్రులు ఆశీస్సులు అందించి అండగా నిలవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, వసతి గృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో..

విద్యార్థుల సంఖ్య : 37,485 మంది
నగదు : రూ.34.36 కోట్లు

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య
ఆత్మకూరు	4,276
కందుకూరు	4,089
కావలి	4,395
కోవూరు	4,501
నెల్లూరు సిటీ	9,328
నెల్లూరు రూరల్	553
సర్వేపల్లి	3,811
ఉదయగిరి	4,779
వెంకటగిరి (సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలు)	1,753

పథకాలు ఎంతో బాగున్నాయి



నేను బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. సీఎం జగనన్న విద్యా దీవెన పథకం కింద ఫీజులు చెల్లిస్తున్నారు. ఈ ఏడాది మా తమ్ముడికి కూడా అమ్మఒడి వర్తించనుంది. సీఎం ప్రవేశపెట్టిన పథకాలు విద్యార్థులకు ఎంతో బాగున్నాయి.

– గోపిశెట్టి భానుకృష్ణశ్రీ, కింగ్స్ డిగ్రీ కళాశాల, నెల్లూరు

ఫీజు కష్టాల్లేవు



మాది సూళ్లూరుపేట. నాన్న ట్రాక్టర్ డ్రైవర్. నాకు ప్రతి ఏడాది వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు అందుతున్నాయి. దీంతో మా కుటుంబంపై ఫీజుల భారం తగ్గింది. జగనన్నే నా కాలేజీ ఫీజు మొత్తం చెల్లిస్తూ నాకు, నా కుటుంబానికి భరోసాగా ఉన్నారు.

– వల్లూరు సుహిత, రిచ్ కాలేజీ, బీవీనగర్, నెల్లూరు

జగనన్న ఆశీస్సులతో నర్సింగ్ చేస్తున్నా



నెల్లూరు దుర్గా కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాను. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి. నేరుగా అమ్మ మస్తానమ్మ ఖాతాలో నగదు జమవుతోంది. జగనన్న ఆశీస్సులతో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి మా కుటుంబానికి అండగా ఉంటా.

– మల్లి శ్రావణి, దుర్గా కాలేజీ, నెల్లూరు

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నేషనల్ నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ పోర్టల్ జిల్లా స్థాయి కమిటీ మూడో సమావేశం బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగింది. ఇందులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ గంజాయిని అరికట్టేందుకు పాఠశాలలు, జూనియర్ కళాశాలల సమీపంలోని దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుని డార్క్ స్పాట్స్‌ను గుర్తించి, ఆ ప్రదేశాల్లో గంజాయి అమ్మకాలు, వినియోగం జరగకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులు, పార్సిల్ రవాణా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాదక ద్రవ్యాలు లేకుండా మంచి ఫలితాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. తీర ప్రాంతాల్లో మత్స్య శాఖ, మెరైన్, కోస్ట్‌గార్డు సిబ్బంది సమన్వయంతో పనిచేసి మత్స్యకారులకు అవగాహన కల్పించడంతోపాటు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తొలుత జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై నమోదు చేసిన కేసుల వివరాలు అరెస్టులు, నివారణకు చేపట్టిన చర్యలను ఏఎస్పీ వివరించారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ 14400 ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ఏసీబీ ఇంటెలిజెన్స్ అధికారి నక్వీ, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ వీర కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రాజు, డీఈఓ గంగాభవాని, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈనెల 29 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దీనికి కన్వీనర్‌గా ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రావు వ్యవహరిస్తారు. కావలిలోని ప్రభుత్వ, నెల్లూరులోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఎస్టీ విద్యార్థులు నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. తొలిరోజు 1 నుంచి 12 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. పీహెచ్, ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్, మైనార్టీ, ఆంగ్లో ఇండియన్ కోటాలో చేరాలనుకునే వారు వచ్చేనెల 2వ తేదీ నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.

మేమింతే.. మారమంతే

2022 అక్టోబరులో సీతారామపురం మండలం అయ్యవారిపల్లికి చెందిన ఓ రైతు 0.70 సెంట్ల పట్టాదారు పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు గానూ అప్పటి తహసీల్దార్ సతీష్‌కుమార్ రూ.10 వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తహసీల్దార్ కార్యాలయంలోనే సతీష్‌కుమార్ నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

ఈ ఏడాది ఏప్రిల్ 26, 27 తేదీల్లో కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి జరుగుతున్నట్లుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు చేశారు. అక్కడ ఓ డెస్కులో రూ.1.03 లక్షల నగదు దొరికింది. అనధికార వసూళ్లకు కారకులైన వారిపై కేసు నమోదు చేశారు. సబ్ రిజిస్ట్రార్‌ను ఇటీవల అక్కడి నుంచి బదిలీ చేశారు.

ఇవి మచ్చుకు రెండు ఉదాహరణలు మాత్రమే.

- అవినీతి ఊబిలో పలువురు వీఆర్వోలు, తహసీల్దార్లు
- ముడుపులు ఇవ్వనిదే ముందుకు సాగని పనులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం



దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయం

ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. అవినీతి లేని పాలన అందించాలని పదేపదే సూచిస్తున్నా.. కొందరు అధికారుల్లో మార్పు రావడం లేదు. ప్రభుత్వం అవినీతిని అరికట్టేందుకు ఇటీవల 14400 నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో లంచాలు ఇవ్వలేని అనేక మంది ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం దుత్తలూరు మండలం సోమలరేగడకు చెందిన వీఆర్వో ఓ రైతు నుంచి పట్టాదారు పాస్‌బుక్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ప్రభుత్వం నుంచి వచ్చే జీతాలు తీసుకుంటూ అనేక మంది అధికారులు ముడుపుల బాగోతానికి తెరలేపుతున్నారు. అధికారులు ఎడాపెడా దాడులు చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా లంచాలు వసూలు చేయకుండా ఉండలేకపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటమే అవినీతి, అక్రమాలకు ప్రధాన కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పాసుపుస్తకం కోసం దరఖాస్తు వస్తే పండగే!

ఎవరైనా పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ కార్యాలయంలో కొంత మందికి పండగే. కచ్చితంగా కొంత మొత్తంలో డబ్బు ఇస్తేగానీ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు కాదని ముందుగానే వీఆర్వోలు సదరు రైతులకు లెక్కలు చెబుతున్నారు. కార్యాలయంలో దిగువస్థాయి వ్యక్తి నుంచి తహసీల్దార్ వరకు పర్సంటేజ్ పేరుతో పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లంచం ఇచ్చిన వారి పనులు ఆగమేఘాల మీద పూర్తవుతుండగా, లంచం ఇవ్వలేని వారి పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, దుత్తలూరు, కలిగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేరుగా ఫిర్యాదు చేయాలి

> ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినా, అక్రమాస్తులు కలిగి ఉన్నా తమకు సమాచారం అందజేయాలి. లేదా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ యాప్‌లో ఆడియో, వీడియోలు రికార్డ్ చేసి పంపితే వెంటనే చర్యలు తీసుకుంటాం. 14400 నంబర్‌కు ఫిర్యాదు చేసి ఏసీబీ సాయం పొందాలి.
> – జీఆర్ఆర్ మోహన్, ఏసీబీ డీఎస్పీ, నెల్లూరు

పొదలకూరు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.15



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.143
లేయర్ లైవ్ :	రూ.98
బ్రాయిలర్ చికెన్:	రూ.244
స్కిన్‌లెస్ చికెన్:	రూ.270
లేయర్ చికెన్:	రూ.167



గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



హాజరైన సీడీపీఓలు, సూపర్‌వైజర్లు



మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రక్తహీనతను తగ్గించడానికి ఐరన్, ఫోలిక్ మాత్రలు ఇవ్వాలని, వాటితో పాటు బలవర్థక ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీల పరిధిలో పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలను నమోదు చేయాలని, ప్రతినెలా 1 నుంచి 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరగాలన్నారు. గ్రోత్ మానిటరింగ్ సక్రమంగా నిర్వహించాలని, లెక్కల్లో తేడాలు నమోదు చేస్తే సంబంధిత వారిపై చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, సీడీపీఓలు, అసిస్టెంట్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన గ్రామస్తులతో మంత్రి కాకాణి

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వార్డు మెంబర్ చిల్లకూరు మోహన్‌రెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు.

- కొడవలూరు: మండలంలోని గండవరానికి చెందిన సీనియర్ నేత అడపాల మోహన్‌కృష్ణ టీడీపీకి రాజీనామా చేసి ఆయన అనుచరవర్గంతో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జి.జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు పెనాక నాగశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవడమే లక్ష్యం

- గొలగమూడిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రారంభం



అవయవాల తయారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈఓ, ట్రస్టు హెడ్

వెంకటాచలం: దివ్యాంగులకు అండగా నిలవాలనే లక్ష్యంతో గొలగమూడిలో దివ్యాంగుల కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాలలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని భగవాన్ మహవీర్ జైన్ రిలీఫ్ ఫౌండేషన్ ట్రస్టు హెడ్ పీసీ ఫరాఖ్‌తో కలిసి ఈఓ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాలను నిర్మించి, ప్రతిరోజు ఆయుర్వేద, అల్లోపతి, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల కోసం గొలగమూడిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. బర్డ్స్ హాస్పిటల్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

చేయూత మార్టులతో మహిళా సాధికారత

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి




మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న పీడీ సాంబశివారెడ్డి

ఉదయగిరి (వింజమూరు) : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, అందులో భాగంగానే చేయూత మార్టులను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. వింజమూరులోని కావలి రోడ్డులో చెక్‌పోస్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సమావేశంలో పీడీ మాట్లాడారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టులుగా ఒకటి కందుకూరులో ప్రారంభించామని, అది విజయవంతమైందన్నారు. వింజమూరులో రెండో మార్టును ఏర్పాటు చేశామని వివరించారు. మండలంలోని 774 పొదుపు సంఘాల్లో 7,740 మంది సభ్యులకు చెందిన రూ.16,25,400 షేర్ ధనంతో ఈ మార్టును ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వచ్చే లాభాలు ఏడాదికోసారి పంచుతామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ రాజు, చేయూత డీపీఎం తిరుపతయ్య, ఉదయగిరి ఇన్‌చార్జి ఏపీ ఖాజారహంతుల్లా, స్థానిక కమిటీ అధ్యక్షురాలు ఎస్తేరమ్మ, ప్రధాన కార్యదర్శి బుజ్జమ్మ, వెలుగు సీసీ పార్వతి, వీఏఓలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ రెసిడెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో సంవత్సరం పాటు తాత్కాలిక పద్ధతిలో క్లినిక్, నాన్ క్లినిక్ విభాగాల్లో నియామకం కోసం సీనియర్ రెసిడెంట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయంలో వాకిన్ ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు spsnellore.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌ను వీడిన డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్



సుమంత్‌రెడ్డి (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. గత కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి బుధవారం పంపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జాతీయ, రాష్ట్ర పదవుల్లో పనిచేసి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా సుమంత్‌రెడ్డి వ్యవహరించాడు. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జిగా, కాంగ్రెస్ ఆస్తుల అభివృద్ధి కమిటీ మెంబర్‌గా పనిచేస్తూ రాజీనామా చేశారు.

చోరీ కెమెరాలు కాకినాడ పోలీసులకు అప్పగింత

కావలి: కావలి ఒకటో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.కోటి విలువైన కెమెరాలు, నిందితుడిని కాకినాడ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. సినిమా షూటింగ్ పేరుతో హైదరాబాద్ నుంచి కాకినాడకు తెప్పించిన రూ.కోటి విలువైన కెమెరా, లెన్స్‌లను యజమానుల కళ్లు గప్పి బెంగళూరుకు చెందిన పాత నేరస్తుడు మాయం చేసిన విషయం తెలిసిందే. బెంగళూరులో నిందితుడిని అదుపులోకి తీసుకుని కాకినాడ పోలీసులకు సమాచారం అందించడంతో వారు కావలి చేరుకుని నిందితుడిని, కెమెరాలను కాకినాడకు తీసుకువెళ్లారు.